క్లుప్తంగా

క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



వ్యాధిగ్రస్తులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ సత్యవతి

ఆదోనిటౌన్ : 2025 నాటికి క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అందుకు ప్రజలు సహకరించాలని ఆదోని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సత్యవతి కోరారు. గురువారం శంకర్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ప్రధానమంత్రి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్బన్‌హెల్త్ సెంటర్ ఉద్యోగులు ఐదుగురిని దత్తత తీసుకున్నారని, వీరికి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేస్తుండటం అభినందనీయమన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు పాల్గొన్నారు.

దర్గాకు తరలివచ్చిన భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలి వచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. మధ్యాహ్నం దర్గాలో అన్నదానం ఏర్పాటు చేశారు.

బాలుడు అదృశ్యం



గొల్ల విజయ్‌కుమార్ (ఫైల్)

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన గొల్ల విజయ్‌కుమార్ (16) అనే బాలుడు గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని, బంధువులను విచారించినా జాడ కనిపించలేదని తండ్రి గొల్ల రాజగోపాల్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు.

సమయపాలన పాటించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెద్దకడబూరు : సచివాలయ, వెటర్నరీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక సచివాలయం -1, 2, పశువుల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్యూటీలో భాగంగా బయటకు వెళ్లాల్సి వస్తే మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

విత్తన దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

కోసిగి: అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కిరణ్ హైబ్రీడ్స్, కోరమాండల్, వాసవి, మంజునాథ, వెంకటేశ్వర, దుకాణాల్లో విత్తనాల స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. కోరమాండల్ లో బిల్లు బుక్ నిర్వహణ సరిగా లేకపోవడంతో రూ.6.7 లక్షల విలువజేసే స్టాక్ విక్రయాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఏఓలు రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

బనవాసి నర్సరీని అభివృద్ధి చేయాలి



మొక్కకు నీరుపోస్తున్న భవాని

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఫారంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న నర్సరీని మరింత అభివృద్ధి చేయాలని ప్లాంటేషన్ డిప్యూటీ కమిషనర్ భవాని సూచించారు. ఆమె గురువారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం బనవాసి ఫారంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. బనవాసి ఫారం నర్సరీలో మొక్కల పెంపకానికి సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే రాళ్లదొడ్డి బ్లాక్ ప్లాంటేషన్‌లో రోజూ 5 మొక్కలు నాటాలన్నారు. మొక్కలకు నీరందించేందుకు బోరు వేయించే విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. ఏపీడీ వలిబాషా, ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ సుజాత, ఏపీఓ విజయమోహన్, ఫారం నర్సరీ టీఏ భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్ దేవశంకరయ్య, ఎఫ్ఏలు ఉరుకుందు, భాస్కర్ ఉన్నారు.

పదకొండేళ్ల తర్వాత బర్త్ సర్టిఫికెట్..



ధ్రువ పత్రం చూపుతున్న మహిళ పేరు లక్ష్మి, కోసిగి మండలంలోని వందగల్లు వాసి. ఈమెకు దివ్యాంగుడైన కుమారుడు ఉన్నాడు. వయస్సు 11ఏళ్లు. ఇంతకు ముందు బర్త్ సర్టిఫికెట్ కోసం పలుమార్లు పంచాయతీ కార్యదర్శి నుంచి మండల కేంద్రంలోని అధికారులను కలిసినా సర్టిఫికెట్ ఇవ్వలేదు. ఇలా 11 ఏళ్ల పాటు నిరీక్షించానని, ప్రస్తుతం మా గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి రెండు రోజుల్లోనే ధ్రువ పత్రం అందజేయడం సంతోషంగా ఉందని చెబుతోంది. ఇలాంటి కార్యక్రమాల వల్ల తమ లాంటి పేదవాళ్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొంది.

ఆరోగ్య శ్రీ కార్డు వచ్చింది..



ఆరోగ్యశ్రీ కార్డు చూపుతున్న ఈమె జీవమ్మ, కోసిగి మండలంలోని వందగల్లు గ్రామం. తన భర్త హనుమేష్‌కు వెన్నుముక భాగంలో పుండు లాంటిది కావడంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. అసలే పేదరికం.. ఆపై ఆపరేషన్ అంటే అంత సొమ్ము పెట్టుకోలేనని, ఏమి చేయాలో సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో..గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తారు.. మీకేమైన ధ్రువ పత్రాలు అవసముందా అంటూ వలంటీర్లు, సచివాయల సిబ్బంది ఇంటికి వచ్చి అడిగారు. సమస్యను చెప్పగా వెంటనే ఆరోగ్యశ్రీ కార్డుకు దరఖాస్తు చేశారు. ఆ వెంటనే గ్రామంలో కార్యక్రమం నిర్వహించి నన్ను అక్కడికి పిలిపించి సారోళ్లు ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. నా భర్తకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయిస్తాను. ఇలాంటివి చేస్తే ప్రజలకు ఎల్లకాలం గుర్తుండిపోతారు అంటోంది.

పన్నెండేళ్ల పోరాటానికి.. జగనన్న సురక్షతో పరిష్కారం..



ఈ ఫొటోలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ చూపుతున్న వృద్ధురాలి పేరు చంద్రు వీరవేణి. కుంబళనూరు క్యాంపు. ఈమె భర్త చంద్రు రామరావు 12 ఏళ్ల క్రితం మృతి చెందాడు. తనకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇన్నేళ్లుగా తిరగని కార్యాలయం లేదని వాపోయింది. 'ఎన్నిసార్లు అధికారులను కలిసినా వారు కనికరించలేదు. అయితే ఇటీవల గ్రామంలోని వలంటీర్లు, సచివాలయ అధికారులు ఇంటికొచ్చి ఏమైనా సర్టిఫికెట్ కావాలా అని అడిగారు.. సరే.. ఇదొక్కసారి ప్రయత్నించి చూద్దామని వారికి వివరాలు తెలియజేశా. అంతే నాలుగు రోజుల్లోనే నాకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేశారు'. ప్రభుత్వం అంటే ఇలా ఉండాలి..అంటూ సంతోషం వ్యక్తం చేస్తుంది.

అర్హులెవరూ సంక్షేమ పథకాలకు దూరంగా మిగిలిపోరాదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో ఇంటికే వచ్చి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను అందజేసి ఏ పథకానికి ఎవరు అర్హులో గుర్తించి వర్తింపేజేసేందుకు చర్యలు చేపట్టింది. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో సంక్షేమ పథకాలు అందక పేదలు అలాగే ఉండిపోయారు. దీన్ని గమనించిన సీఎం జగనన్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించడానికి రెండు, మూడు రోజులు ముందుగానే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి వివరాలు సేకరిస్తారు. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్నారు.



కోసిగిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి (ఫైల్)

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

- ప్రజల ముంగిటే సమస్యలకు పరిష్కారం
- గ్రామంలోనే అవసరమైన ధ్రువ పత్రాలు ఉచితంగా అందజేత
- ప్రభుత్వంపై మరింత పెరిగిన నమ్మకం
- నియోజకవర్గంలో ముగిసిన 'జగనన్న సురక్ష'
- 24,998 మందికి వివిధ రకాల సర్టిఫికెట్ల పంపిణీ



జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ (ఫైల్)

కౌతాళం: గ్రామాల్లో ఏళ్లుగా సాగుతున్న సమస్యలకు జగనన్న సురక్ష కార్యక్రమం పరిష్కారం చూపింది. ఎంతో మంది పేదలు అవసరమైన వివిధ రకాల ధ్రువ పత్రాలు లేక పథకాలకు దూరంగా ఉండిపోయారు. దీంతో తాము అర్హత ఉండి పథకాలు అందుకోలేకపోతున్నామనే బాధ వారికి వేధిస్తుండేది. దీన్ని గమనించిన సీఎం వైఎస్ జగన్ సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా గ్రామానికి వచ్చి అందజేస్తారు.

అవసరాలను గుర్తిస్తున్న గృహసారథులు, వలంటీర్లు..

సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడంలో గ్రామ వలంటీర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరికి ఏ ధ్రువ పత్రం అవసరమో గుర్తిస్తున్నారు. వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి టోకెన్ జారీ చేస్తారు. అలాగే పథకాలు అందకపోయి ఉంటే కారణాలు తెలుసుకొని అవసరమైన సర్టిఫికెట్ జారీకి దరఖాస్తు చేయిస్తున్నారు. ఈ వివరాలను మండల స్థాయి అధికారులతో కూడిన ప్రత్యేక బృందం విచారణ జరిపి అర్హులని నిర్ధారణ అయితే ధ్రువ పత్రాలు అందజేసి పథకాలకు అర్హత కల్పిస్తున్నారు. అయితే ఈ తతంగమంతా కేవలం రెండు నుంచి నాలుగు రోజుల్లో పూర్తవుతుంది. చివరగా గ్రామంలో సభ నిర్వహించి ధ్రువ పత్రాలు అందజేస్తారు. రోజుల తరబడి తిరిగినా మంజూరు కాని సర్టిఫికెట్లు కేవలం రెండు నుంచి మూడు రోజుల్లో యంత్రాంగమే ఇంటికి వచ్చి అందజేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా నియోజకవర్గంలో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసిన తరువాత ఆయా గ్రామాల వలంటీర్లు యాప్‌ను క్లోజ్ చేయని కారణంగా పెండింగ్ చూపుతోందని, అలాగే కొందరు సరైన వివరాలు అందజేయకపోవడమే కారణమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మిగిలిన వారికి కూడా త్వరలోనే ధ్రువ పత్రాలు అందజేస్తామని చెబుతున్నారు.

జగనన్న సురక్షకు వచ్చిన దరఖాస్తులు, ధ్రువ పత్రాలు అందజేసిన వివరాలు..

మండలం	దరఖాస్తులు	అందజేసిన ధ్రువ పత్రాలు	పరిష్కార శాతం
కౌతాళం	6,674	5,456	81.75
పెద్దకడుబూరు	4,908	4,526	92.21
కోసిగి	9,682	9,586	99.00
మంత్రాలయం	5,925	5,430	91.64

వచ్చిన దరఖాస్తులు -	27,189
అందజేసిన ధ్రువ పత్రాలు -	24,998
పెండింగ్‌లో ఉన్నవి -	2,191

మండలాల వారీగా గ్రామ సచివాలయాల సంఖ్య

కౌతాళం -	23
కోసిగి -	19
పెద్దకడుబూరు -	18
మంత్రాలయం -	18

జలమయమైన రహదారులు





సబ్ రిజిష్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో నిలిచిన నీరు, రైతు బజార్‌లో నిలిచిన వర్షపు నీరు

ఆదోని సెంట్రల్: పట్టణంలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సబ్ రిజిష్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో కార్యాలయానికి వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతు బజార్‌లో భారీగా నీరు నిలిచిపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు. అలాగే శ్రీనివాసభవన్ , రైల్వే స్టేషన్ రహదారుల్లో కూడా నీరు రోడ్లపై నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కోసిగి: మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో మండల కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. అక్కడక్కడ పలు చోట్ల పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రైల్వే గేటు వద్ద రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం రాకతో నది తీర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి సాగుకు ఈ వర్షాలు అనుకూలంగా మారాయని చెబుతున్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీలో ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమై రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పట్టణంలోని 2వ వార్డు, బావూజీపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, రైతుబజార్, దూరదర్శన్ కేంద్రం తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించి వర్షపు నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. రైతుబజార్ వద్ద పెద్దకాలువలో వరదనీరు భారీగా చేరడంతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. వర్షపునీరు సులువుగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైల్వేస్టేషన్ రోడ్డు, సబ్‌రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నిల్వ చేరడంతో రాకపోకలకు స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

దోషులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పాస్టర్

కౌతాళం: మణిపూర్ సంఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, అక్కడ శాంతి నెలకొల్పాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో క్రిష్టియన్లు, ముస్లిం మైనారిటీ సంఘాలు, సీపీఎం, సీపీఐ, రైతుకూలీ సంఘం, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో చర్చి నుంచి భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌బజార్, ఖాదర్‌లింగస్వామి దర్గా మీదుగా వైఎస్సాఆర్ సర్కిల్ చేరి అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, సీఎస్ఐ చర్చి సంఘం కాపరి బళ్లారి జిల్లా యేరియా చైర్మన్ రెవరెండ్ శ్యాముల్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలు దేశానికి, మానవత్వానికి కళంకమన్నారు. అత్యాచారాలు, చిన్న పిల్లలు, వృద్ధులపై జరుగుతున్న మారణహోమాలపై చర్యలు తీసుకోకపోవడం విచారకరం అన్నారు. సర్పంచ్ పాల్‌దినకర్ మాజీ సర్పంచ్ అవతారం, రైతుకూలీ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి నాగేంద్ర, జగదీష్, సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, అవాజ్ కమిటీ నాయకులు ఈద్రుస్, తాహెర్, షేక్షావలి, దూద్‌బాషా, ఇసాక్, జాకీర్, హాజి, మహబూబ్, పాస్టర్లు నందకుమార్, సతీష్, రవికుమార్, విజయ భాస్కర్, జకరయ్య, యోహాన్, ఎలీషా పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు మానవత్వానికే మచ్చ



మాట్లాడుతున్న ప్రహ్లాద్

ఆదోని సెంట్రల్: సంప్రదాయాలకు నిలయమైన దేశంలో మణిపూర్ ఘటనలు మానవత్వానికే మచ్చ అని అరసం జిల్లా అధ్యక్షుడు కె. ప్రహ్లాద్ పేర్కొన్నారు. పట్టణంలోని కిడ్డీస్ పాఠశాలలో గురువారం మణిపూర్ సంఘటనపై సాహితీకారులు ముక్తకంఠంతో నిరసనగళం వినిపించారు. వారు మాట్లాడుతూ మహిళలను గౌరవంగా చూసుకునే మన దేశంలో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరగడం సమాజానికే సిగ్గు చేటన్నారు. మూడు నెలలుగా హింసాత్మక సంఘటనులు జరుగుతున్నా పాలకులు, అధికారులు స్పందించక పోవడం విచారకరమన్నారు. యావత్ ప్రజానీకం మేల్కోవాల్సిన అవసరం ఉందన్నారు. అరసం నాయకులు కెసీ మల్లికార్జున, సుధాకర్ మాట్లాడుతూ మణిపూర్‌లో రోజు రోజుకు హింసాత్మక సంఘటనలు పెట్రేగిపోతున్నా చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. సాహితీ స్రవంతి నాయకుడు భాస్కర్, అరసం కార్యవర్గ సభ్యుడు నాగన్న, ఉపాధ్యాయులు ప్రసాద్, శివ పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఎమ్మిగనూరు డీఎస్పీ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య గురువారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు, టూరిస్ట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రం ఏర్పాటుపై హర్షం

ఆదోనిఅర్బన్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడంపై స్థానిక బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపులో మోదీ ప్రసంగాన్ని డిజిటల్ వీడియో ద్వారా వీక్షించారు. ఆయన మాట్లాడుతూ 1.25 లక్షల కేంద్రాలను జాతికి అంకితం చేశారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద 14వ విడత కింద రూ.19,500 కోట్లు నిధులను, కేంద్రం అందిస్తున్న యూరియా సబ్సిడీ గురించి వివరించారన్నారు. ఏడీఏ గిరీష్, ఏఓ అశోక్, కిసాన్‌మోర్చా పట్టణ అధ్యక్షుడు వెంకటేష్, విక్రమ్‌రెడ్డి, విట్టా రమేష్, రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠ, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిస్వామి పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆదోనిటౌన్ : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోయజాతి పుట్టకతోనే గిరిజనులని, ఎస్టీలుగా ఉన్న వారిని తొలగించి అణిచివేతకు గురి చేశారన్నారు. 70 యేళ్లుగా వాల్మీకులు పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నా ఎస్టీలుగా గుర్తించడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు.

టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల పరిశీలన

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ టమాట ప్రాసెసింగ్ యూనిట్ త్వరలో ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. ఇటీవల పత్తికొండ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఉద్యాన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా పీడీ ఉమాదేవి పత్తికొండకు వచ్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఆర్‌డీఓ మోహన్‌దాసు, అధికారులతో కలిసి పత్తికొండ పరిసర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. హోసూరు రోడ్డు, కర్నూలు రోడ్డు, గుత్తి రోడ్డులో స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా ఇమామే ఖాసిం ఉత్సవం

కౌతాళం: మొహర్రం పూజల్లో భాగంగా తెల్లవారు జాము నుంచి గురువారం ఉదయం వరకు మండల కేంద్రంలో కొలువైన ఇమామే ఖాసీం (గంటెప్ప దేవర) ఉత్సవం వైభవంగా సాగింది. రాఘవేంద్రస్వామి ఆలయం మెయిన్ రోడ్డు నుంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా జామియా మసీదు మీదుగా జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా చేరి బైటిగేరి వరకు కొనసాగింది. ఊరేగింపు భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాల మధ్య జరిగింది. పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



ఇమామే ఖాసిం పీరును ఊరేగిస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే సురక్ష ధ్యేయం





వందగల్లులో సర్టిఫికెట్స్ అందజేస్తున్న ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

కోసిగి: అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వందగల్లు గ్రామంలో సర్పంచ్ కొరువంజమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 1,403 దరఖాస్తు పరిష్కరించి సర్టిఫికెట్స్ అందజేశారు. వీఆర్వో బసవరాజు, నాయకులు కాల్వ లక్ష్మయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ గీతావాణి అన్నారు. గురువారం మండలంలోని ధణాపురం గ్రామంలో ఎంపీపీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. మొత్తం 655 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ హనుమయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వండి



మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్ బాలాజీ

ఆదోనిటౌన్ : తాము ప్రజాప్రతినిధులమేనని, తమను వేరేలా చూడొద్దని, తమకు ప్రభుత్వ, మున్సిపల్ కార్యక్రమాల సమాచారం ఇవ్వాలని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు బాలాజీ, రఘునాథ్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, పార్వతి మాట్లాడారు. మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినా అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని, తమ వార్డుల్లో భూమిపూజలు, శంకుస్థాపనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం ఎంతవరకు సబబు అంటూ ప్రశ్నించారు. ఇంతటి నిర్లక్ష్యధోరణి ఎందుకు అంటూ కమిషనర్‌ను నిలదీశారు. అనంతరం అజెండాలోని 02, 24, 42 అంశాలను పరిశీలించిన పిమ్మట టెండర్లు పిలవాలని, అంతవరకు వాయిదా వేయాలని వైస్ చైర్మన్ నరసింహులు చైర్‌పర్సన్‌ను కోరగా, ఆ మూడు అంశాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 1వ వార్డులో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు రోడ్లపై చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, కాలువలను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ పార్వతి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏయే వార్డుల్లో ఏయే అభివృద్ధి పనులు చేస్తున్నారనే సమాచారాన్ని ప్రతి సభ్యుడికి తెలియజేయాలని కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డి అధికారులను కోరారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు వద్ద 300 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని, పూర్తి స్థాయిలో విచారించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, డీఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, టీపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో పారదర్శక పాలన



హొళగుందలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: సీఎం జగనన్నది వివక్ష లేని పాలన అని, కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ఆయన సొంతమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంత్రి గురువారం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామితో కలిసి హొళగుంద-1 సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎంపీపీ తంబాకు నూర్జహన్, సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి ప్రజలకందించిన పథకాలు, ఇతర విషయాల గురించి ఆరా తీశారు. ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు.

నాలుగేళ్లలో రూ.34.57 కోట్లు అందజేత

అనంతరం గ్రామ ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో హొళగుందలోని నాలుగు సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.34.57 కోట్లు ప్రజలకు అందించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా తెలుసుకోవాలని సూచించారు. అలాగే నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

హొళగుంద సచివాలయం-1 పరిధిలోని బీసీ కాలనీలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వెంటనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. సంతమార్కెట్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, బీసీ కాలనీలో సామూహిక మరుగుదొడ్లకు రూ.10 లక్షలు, సీసీ రోడ్డుకు రూ.5 లక్షల నిధులు కేటాయిస్తున్నామని వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు వృద్ధులు జగనన్న మా పెద్ద కొడుకులా చూసుకుంటున్నారని మంత్రితో చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున, కుమారస్వామి, వెంకటేష్, శేషప్ప, పంపాపతి, దొడ్డబసప్ప, రామకృష్ణ, తహసీల్దారు హుసేన్ సాహెబ్, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, హౌసింగ్ డీఈఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.